# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## **ప్రాంతీయ వార్తలు**

**తేది : 24-10-2024** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడానికి బ్రిక్స్ సభ్య దేశాలు ఏకతాటిపైకి రావాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ కోరారు.**
2. **ఆంధ్రప్రదేశ్‌లో ఏడాదికి 3 ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ హామీని ఈ నెల 31 నుంచి అమలు చేయాలని రాష్ట్ర మంత్రి వర్గం నిర్ణయించింది.**
3. **పోలవరం ప్రాజెక్టులో డయాఫ్రం వాల్ పనులను 2025 చివరి నాటికి పూర్తి చేసేలా ప్రణాళికలు రూపొందించాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు.**
4. **తెలంగాణలో ధాన్యం సేకరణ, కొనుగోళ్ల ప్రక్రియ పర్యవేక్షణకు ప్రత్యేక బృందాలు ఏర్పాటుచేయాలని పౌర సరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు.**
5. **తూర్పు మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన 'దానా' తుపాను తీవ్ర తుపానుగా మారనుందని భారత వాతావరణ కేంద్రం తెలిపింది.**

===========================

రష్యాలోని కజాన్‌లో జరిగిన బ్రిక్స్ సదస్సులో పాల్గొన్న అనంతరం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గత రాత్రి ఢిల్లీ చేరుకున్నారు. మరోవైపు నిన్న రష్యాలోని కజాన్‌లో జరిగిన 16వ బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు ముగింపు కార్యక్రమంలో ప్రధాన మంత్రి ప్రసంగిస్తూ... ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడానికి బ్రిక్స్ సభ్య దేశాలు ఏకతాటిపైకి రావాలని కోరారు. బ్రిక్స్ కూటమి గత 2 దశాబ్దాల కాలంలో ఎన్నో విజయాలు సాధించిందని భవిష్యత్ లో ప్రపంచ సవాళ్లను ఎదుర్కోవటానికి ఇది మరింత ప్రభావవంతమైన మాధ్యమంగా ఆవిర్భవిస్తుందని పేర్కొంటూ,

వాయిస్ (23 సెకన్లు)

---------------------------

రాష్ట్రంలో ఏడాదికి 3 ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ హామీని ఈ నెల 31 నుంచి అమలు చేయాలని రాష్ట్ర మంత్రి వర్గం నిర్ణయించింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో రాష్ట్ర మంత్రివర్గం నిన్న సమావేశమైంది. ఈ సమావేశంలో తీసుకున్న ఈ నిర్ణయాలను మంత్రులు కొలుసు పార్థసారథి, నాదెండ్ల మనోహర్, కొల్లు రవీంద్ర, వంగలపూడి అనిత పాత్రికేయులకు

వెల్లడించారు. నాలుగు నెలలకు ఓ సిలిండర్ చొప్పున ఉచితంగా ఇస్తామని, గ్యాస్ డెలివరీ అయిన 48 గంటల్లో ఆ నగదును వారి బ్యాంకు ఖాతాల్లో జమయ్యేలా ఏర్పాటు చేయనున్నామని రాష్ట్ర హోంశాఖ మంత్రి అనిత తెలుపుతూ,

వాయిస్ (34 సెకన్లు )

ఆలాగే రాష్ట్రంలో ప్రజలు ఎవరైనా ఉచితంగా ఇసుక పొందేలా సీనరేజ్ తదితరాలు రద్దు, ఆలయ పాలకమండళ్ల సభ్యులలో ఓ స్థానంలో బ్రాహ్మణులను నియమించడం వంటి నిర్ణయాలకు రాష్ట్ర మంత్రి వర్గం ఆమోదం తెలిపింది.

---------------------------

పోలవరం ప్రాజెక్టులో డయాఫ్రం వాల్ పనులను 2025 చివరికి పూర్తి చేసేలా ప్రణాళికలు రూపొందించాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. రాష్టంలోని జలవనరుల ప్రాజెక్టులపై అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జలవనరుల సంరక్షణలో సృజనాత్మకంగా ఆలోచించాలని, నీటిని సమర్థంగా వినియోగించుకునేందుకు ప్రణాళికలు రూపొందించాలన్నారు. వరద నీటిని నిల్వ చేసుకునేలా. కరవు వచ్చినా ఇబ్బంది లేనివిధంగా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి అధికారులకు దిశానిర్దేశం చేశారు.

---------------------------

తెలంగాణలో వానాకాలం సీజన్‌కు సంబంధించి ధాన్యం సేకరణపై ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నేతృత్వంలో ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘం నివేదిక సిద్ధం చేసిందని పౌర సరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెల్లడించారు. హైదరాబాద్‌లోని పౌర సరఫరాల భవన్‌లో సంబంధిత అధికారులతో మంత్రి సమావేశమైయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇప్పటివరకు రాష్ట్రంలో 60.73 లక్షల ఎకరాల్లో వరి సాగైందని, 80 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం విక్రయానికి వస్తుందని అంచనా వేస్తున్నామని తెలిపారు. సన్నరకాలు విక్రయించిన రైతుల ఖాతాల్లో బోనస్ నగదును ఈ-కుబేర్ విధానంలో జమయ్యేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. కొనుగోళ్ల ప్రక్రియ పర్యవేక్షణకు ప్రత్యేక బృందాలు ఏర్పాటుచేయాలని కలెక్టర్లను ఆదేశించామని మంత్రి వివరించారు.

---------------------------

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధ్యానతనిస్తున్నామని తెలంగాణ ఐటీ శాఖమంత్రి డి.శ్రీధర్‌బాబు తెలిపారు. హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో నిన్న జరిగిన 'మంత్రులతో ముఖాముఖి' కార్యక్రమంలో మంత్రి పాల్గొని ప్రజలు, పార్టీ కార్యకర్తల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి సమస్యను ప్రభుత్వం పరిష్కరిస్తుందన్నారు. దివ్యాంగులు, ఇందిరమ్మ ఇళ్లు, పింఛన్లు, రేషన్‌కార్డులు, తదితర సమస్యలకు సంబంధించి మొత్తం 328 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. వీటిని సంబంధిత శాఖలకు పంపించి వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ లో డ్రోన్ రంగం విస్తరణకు అనుకూల వాతావరణాన్ని కల్పించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని రాష్ట్ర ఆర్థికశాఖ అదనపు కార్యదర్శి జె.నివాస్ పేర్కొన్నారు. గుంటూరు జిల్లా మంగళగిరిలో నిర్వహించిన అమరావతి డ్రోన్ సదస్సులో భాగంగా నిన్న నిర్వహించిన చర్చలో ఆయన మాట్లాడుతూ... డ్రోన్ల రంగం విస్తరణకు అపార అవకాశాలు ఉన్నాయన్నారు. ప్రైవేటు రంగం ద్వారా భారీ పెట్టుబడులను ప్రోత్సహించాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించుకుందని తెలిపారు. డ్రోన్ విధానంలో పెట్టుబడి పెట్టేవారికీ రాష్ట్ర ప్రోత్సాహకాలను

ప్రభుత్వం అందిస్తోందని అన్నారు. పెట్టుబడుల అవసరమైన వాతావరణాన్ని కల్పించేందుకు 'డ్రోన్ టెక్‌జోన్'ను అందుబాటులోకి తీసుకురాన్నామని నివాస్ పేర్కొన్నారు.

---------------------------

తూర్పు మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన 'దానా' తుపాను తీవ్ర తుపానుగా మారనుందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. ఈరోజు అర్ధరాత్రి నుంచి రేపు తెల్లవారుజాములోపు ఒడిశాలోని పూరీ, పశ్చిమబెంగాల్ లోని సాగర ద్వీపం మధ్య తీరం దాటే అవకాశముందని వెల్లడించింది. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లో రాబోయే మూడు రోజుల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురవవచ్చని తెలిపింది. 'దానా' తుపాను ప్రభావంతో ఉమ్మడి శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాల్లో భారీ వర్షాలకు కురిసే అవకాశముందని పేర్కొంది. కృష్ణపట్నం, వాడరేవు, నిజాంపట్నం, మచిలీపట్నం, కాకినాడ, గంగవరం, విశాఖపట్నం, కళింగపట్నం పోర్టులకు రెండో నంబరు ప్రమాద హెచ్చరిక జారీ చేసినట్లు విశాఖ తుపాను హెచ్చరికల కేంద్రం ముఖ్య అధికారి కేవీఎస్ శ్రీనివాస్ తెలిపారు. తీర ప్రాంతం వెంబడి గంటకు 80-100కి.మీ వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశముందని, ఈ రోజు, రేపు సముద్రం అలజడిగా ఉంటుందని.. మత్స్యకారులు వేటకు వెళ్లరాదని సూచించారు. మరోవైపు తెలంగాణలో దాను తుఫాను ప్రభావం పెద్దగా ఉండదని, పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు మాత్రమే కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది.

దానా తుపాను నేపథ్యంలో తూర్పు కోస్తా రైల్వే అప్రమత్తమైంది. ఇప్పటికే పలు రైళ్లను రద్దు చేయగా.. మరి కొన్నింటిని దారి మళ్లించింది. ప్రయాణికులకు రైళ్ల సమాచారం తెలిపేందుకు వివిధ స్టేషన్లలో హెల్ప్‌లైన్ కేంద్రాలు ఏర్పాటు చేసింది.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని విజయనగరం జిల్లా గుర్లలో అతిసార కేసుల నమోదుకు కలుషిత తాగునీరు కారణమని వైద్య నిపుణుల బృందం పేర్కొంది. అక్కడి పరిస్థితులపై అధ్యయనానికి ఇద్దరు వైద్యులు, ఇతర వైద్య సిబ్బందితో ఏర్పాటుచేసిన నిపుణుల బృందం ప్రభుత్వానికి నివేదికను అందజేసింది. ఈ నివేదికకు అనుగుణంగా తీసుకోవాల్సిన తదుపరి చర్యలపై రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ ఈ రోజు సమీక్ష నిర్వహించనున్నారు.

ఇది ఇలా ఉండగా.. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈరోజు విజయనగరం జిల్లా గుర్లలో పర్యటిస్తారు. అతిసార వ్యాధితో మృతి చెందిన వారి కుటుంబాలను ఆయన పరామర్శించనున్నారు. అనంతరం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శిస్తారని వైసీపీ కేంద్ర కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది.

---------------------------

నెహ్రూయువకేంద్ర ఆధ్వర్యంలో గుంటూరు జిల్లా నాగార్జున విశ్వవిద్యాలయంలో యువ సాంస్కృతిక మార్పిడి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో జమ్ముకాశ్మీర్‌కి చెందిన యువత పాల్గొన్నారు. దీని ద్వారా దేశంలోని విభిన్న సంస్కృతులను తెలుకునే అవకాశం కలిగిందని పలువురు కాశ్మీరీ యువత హర్షం వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ ఆతిథ్యం ఎంతగానో నచ్చిందని జమ్ముకాశ్మీర్‌కి చెందిన నజాకత్ ఆకాశవాణికి తెలుపుతూ,

వాయిస్ ( 37 సెకన్లు

=====================